క్లుప్తంగా

ఆంజనేయస్వామికి అభిషేక సేవ

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం మద్ది క్షేత్రంలో ఆంజనేయస్వామికి అభిషేక సేవ నిర్వహించారు. ఆలయ ముఖమండపంపై అర్చకులు స్వామి వారి ఉత్సవ విగ్రహానికి శాస్త్రోక్తంగా పంచామృత అభిషేకం జరిపారు. ఆలయానికి వివిధ సేవలు, విరాళాల ద్వారా రూ.1,11,441 ఆదాయం సమకూరినట్లు ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. నిత్యాన్నదాన సత్రంలో అధిక సంఖ్యలో భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

నేత్రపర్వం.. శివయ్యకు రుద్రాభిషేకం


శివయ్యకు అభిషేకాలు నిర్వహిస్తున్న అర్చకుడు

ద్వారకాతిరుమల: క్షేత్రపాలకునిగా విరాజిల్లుతోన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామివారి ఆలయంలో శివదేవునికి ఏకాదశ రుద్రాభిషేకాన్ని శనివారం నేత్రపర్వంగా నిర్వహించారు. మాసశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ వేడుకను వైభవంగా జరిపారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాల నడుమ అర్చకులు, పండితులు గర్భాలయంలో కొలువైన శివదేవునికి వేద మంత్రోచ్ఛరణలతో రుద్రాభిషేకాన్ని జరిపి, హారతులిచ్చారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. రాత్రి గంగా, పార్వతీ సమేత శివయ్యకు జరగాల్సిన గ్రామోత్సవం వర్షం కారణంగా రద్దయ్యింది.

శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి ఒక భక్తుడు శనివారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. తణుకుకు చెందిన ఓలేటి నాగేంద్ర కృష్ణ ముందుగా సతీ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. దాతకు ఆలయ సూపరింటెండెంట్ దుర్గాప్రసాద్ విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

శ్రీవారి సేవలో...


రాష్ట్ర మాజీ మంత్రి వెల్లంపల్లికి స్వామివారి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని రాష్ట్ర దేవాదాయశాఖ మాజీ మంత్రి వెల్లంపల్లి శ్రీనివాస్ శనివారం సందర్శించారు. సతీ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు. ఈ సందర్భంగా ఆలయ ఏఈఓ ఐనంపూడి రమణరాజు వెల్లంపల్లికి స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందజేశారు.

ఆక్రమణలు తొలగించాలని కలెక్టర్‌కు వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సుబ్రహ్మణ్యం

లింగపాలెం: ధర్మాజీగూడెంలో బస్టాండ్ ఆక్రమణకు గురైందని, మల్ల సముద్రం, పెద్ద చెరువు ఆక్రమణకు గురైందని వెంటనే ఆక్రమణలు తొలగించాలని ఏలూరు బీజేపీ కార్యదర్శి కుర్ర వెంకట సుబ్రహ్మణ్యేశ్వర వరప్రసాద్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం లింగపాలెం హైస్కూల్లో మొక్కలు నాటే కార్యక్రమానికి వచ్చిన కలెక్టర్ వెట్రిసెల్వికి ఆయన వినతి పత్రం అందజేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ వెంటనే చర్యలు చేపట్టాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.

కేజీబీవీ విద్యార్థులు చదువుల్లో రాణించాలి


ప్రసంగిస్తున్న పంకజ్‌కుమార్

కుక్కునూరు: కేజీబీవీలో చదువుతున్న విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలను అదిరోహించాలని ఎడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ పంకజ్ కుమార్, సీఈఓ కేవీఎస్ ప్రభాకర్ సూచించారు. శనివారం వారు మండలంలోని కేజీబీవీ పాఠశాలలను పరిశీలించి విద్యార్థులతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. సెల్‌ఫోన్లకు బానిసలు కావొద్దని, పట్టుదలతో చదివి లక్ష్యాలను సాధించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా బాలికల సంక్షేమ అధికారి నవీన, మెంటల్ హెల్త్ కౌన్సిలర్ స్వాతి, చిన్నబాబు, ఎస్‌ఓఎస్‌లు సునీత, సుశీల, ఉపాధ్యాయులు అరుణ, జ్యోతి, పాల్గొన్నారు.

దారులు ఇలా.. ప్రయాణం ఎలా?


గోతులమయంగా జీలకరగ్రూడెం రోడ్డు


అధ్వానంగా గొల్లగూడెం రోడ్డు


తడికలపూడి శివారులో రహదారి దుస్థితి

- గోతులమయంగా రోడ్లు
- ప్రయాణం నరకప్రాయమంటున్న వాహనదారులు

కామవరపుకోట: మండలంలో రహదారులు అధ్వానంగా మారాయి. గత కొన్ని రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో రహదారులన్నీ దారుణంగా దెబ్బతిన్నాయి. అడుగడుగునా గుంతలతో ఎక్కడ చూసినా బురదమయంతో చెరువులను తలపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీటితో నిండిన గుంతలతో ప్రయాణం చేయాలంటేనే వాహనదారులు నరకం అనుభవిస్తున్నారు. చింతలపూడి నుంచి జీలకరగ్రూడెం, కామవరపుకోట వరకు ఈ రోడ్డులో బస్సు సర్వీసులు తక్కువగా ఉండటంతో నిత్యం ఆటో సర్వీసులు, పామాయిల్ లోడు లారీలు ఎక్కువగా తిరుగుతూ ఉంటాయి, ఈ రోడ్డులో ఏర్పడిన గుంతలతో వాహనాలు నడపాలంటేనే అవి పూర్తిగా దెబ్బతింటున్నాయని గగ్గోలు పెడుతున్నారు. తమకు వచ్చిన రాబడిలో చాలావరకు వాహనాల మరమ్మతులకే పోతుందని వాహనదారులు వాపోతున్నారు. రాత్రి సమయంలో ఆ గుంతల రహదారి వెంబడి ప్రయాణం చేయాలంటే ప్రమాదానికి ఎక్కడ గురవుతామని చుట్టుపక్కల ప్రాంతాల గ్రామస్తులు భయపడుతున్నారు.

నరకయాతన

జంగారెడ్డిగూడెం, ఏలూరు వయా దేవులపల్లి నుంచి రావికంపాడు, గొల్లగూడెం, నారాయణపురం, ఆడమిల్లి, తడికలపూడి వరకు అడుగడుగునా ఏర్పడిన గుంతలు కుంటలను తలపిస్తున్నాయి. ఈ గుంతలతో జంగారెడ్డిగూడెం నుంచి ఏలూరు వరకు బస్సుల్లో గానీ, ఇతర వాహనాల్లో గానీ వెళ్లాలన్నా వాహన కుదుపులకు ఒళ్లు హూనమై ప్రయాణికులు నరకయాతన చూస్తున్నారు. రహదారుల మరమ్మతుల నిమిత్తం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా ఇప్పటివరకు అధికారుల మాత్రం పట్టించుకోనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఇటీవల జరిగిన మండల స్థాయి సర్వసభ్య సమావేశంలో రోడ్లు అధ్వానంగా ఉండటం వాస్తవమేనని, నిధుల కొరత కారణంగా రోడ్లు మరమ్మతులు చేయలేకపోయామని ఎమ్మెల్యే సొంగ రోషన్ కుమార్ స్వయంగా అంగీకరించారు. దీంతో సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు కాస్త అసహనానికి గురయ్యారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రహదారుల మరమ్మతులను వెంటనే ప్రారంభించాలని వాహనదారులు, స్థానికులు వేడుకుంటున్నారు.

త్వరితగతిన మరమ్మతులు చేయాలి



మండలంలో ప్రధాన రహదారులు గోతులమయంగా మారడంతో ప్రయాణం చేయాలంటే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు గోతుల్లో నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఆ రహదారుల్లో ప్రయాణికులు నరకం అనుభవిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు కేటాయించి రోడ్ల మరమ్మతులు త్వరగా పూర్తి చేయాలి.

– రాయంకుల సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్, కామవరపుకోట

రిపేర్లకే ఖర్చు పెడుతున్నాం



రహదారుల్లో అడుగడుగునా ఏర్పడిన గుంతలతో ఆటోలు నడపాలంటేనే నరకం చూస్తున్నాం, ఆటోలు తరచూ మరమ్మతులకు గురవతుండడంతో సంపాదించిన దానిలో రిపేర్లకే ఎక్కువ ఖర్చవుతుంది. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో సరైన ఆటో సర్వీసులు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాము. అధికారులు వెంటనే స్పందించి రోడ్లు మరమ్మతులు చేయాలి.

– మేడంకి దావీదు, ఆటో డ్రైవర్, కామవరపుకోట

మందుల దుకాణాల్లో దాడులు!

గోప్యత పాటిస్తున్న ఔషధ నియంత్రణ అధికారులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఔషధ నియంత్రణ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. అయితే ఈ దాడులను అధికారులు గోప్యంగా ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఇటీవల జంగారెడ్డిగూడెం, బుట్టాయగూడెం, కొయ్యలగూడెం మండలాల్లో దాడులు నిర్వహించారు. అప్పట్లో ఈ దాడులకు సంబంధించి కూడా అధికారులు గోప్యతను పాటించారు. ప్రస్తుతం ఈ నెల 18న జంగారెడ్డిగూడెంలో దాడులు నిర్వహించారు. ఈ దాడులకు సంబంధించి మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. ఇటీవల బుట్టాయగూడెం రోడ్‌లో ఒక మెడికల్ షాపులో కాలం చెల్లిన మందులను గుర్తించారు. అలాగే బుట్టాయగూడెం రోడ్‌లో ఒక ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌పై తనిఖీ చేసేందుకు వెళ్లగా, ఆ ఆర్‌ఎంపీ క్లినిక్ మూసివేసి వెళ్లిపోయినట్లు సమాచారం. క్లినిక్‌లో అబార్షన్‌లు, ఆపరేషన్‌లు నిర్వహిస్తున్నారన్న ఫిర్యాదు నేపథ్యంలో డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు తనిఖీలు చేసేందుకు వచ్చినట్లు తెలిసింది. అయినప్పటికీ అధికారులు మీడియాకు ఎటువంటి సమాచారం ఇవ్వలేదు. విలేకరులు అడిగితే మెడికల్ షాపుల అసోసియేషన్ గ్రూపుల్లో సమాచారం పెట్టామని ముక్తసరిగా అధికారులు సమాచారం ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. అంతేకాక మెడికల్ షాపుల అసోసియేషన్ ప్రతినిధులను వెంటబెట్టుకొని షాపులపై దాడులు చేస్తూ ఉండటంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అసోసియేషన్ ప్రతినిధులకు నచ్చని వ్యక్తులపైనే దాడులు చేయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

రోటరీ ఆవిర్భావ దినోత్సవం

జంగారెడ్డిగూడెం: మల్లాది సీతా రామలింగేశ్వర రోటరీ కమ్యూనిటీ హాల్ నందు ప్రెసిడెంట్ పెనుమర్తి సురేష్ బాబు, సెక్రెటరీ సంధ్య ప్రవల్లిక ఆధ్వర్యంలో రోటరీ క్లబ్ చార్టర్ నైట్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చార్టర్ మెంబెర్స్ మల్లాది సీతా రామారావు, చామర్తి శ్రీరాములును జ్ఞాపిక, శాలువా, పూలమాలలతో సత్కరించారు. రోటరీ అభ్యుదయానికి కృషి చేస్తున్న కేఎల్ఎన్ ధన కుమార్ బిజినెస్ 2025 అవార్డు అందుకున్న సందర్భంగా ఆయన్ను మెమొంటో, శాలువా పూలమాలలతో సత్కరించారు.

విద్యాసామగ్రి అందజేత

టి.నరసాపురం: ఎన్ఎంఎంఎస్ పరీక్షలకు ప్రతి విద్యార్థి పూర్తిస్థాయిలో సన్నద్ధం కావాలని బొర్రంపాలెం హైస్కూల్ పూర్వ విద్యార్థి జోడాల వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం పాఠశాలలో ఎన్ఎంఎస్ఎస్ పరీక్షలకు విద్యార్థులకు విద్యాసామాగ్రిని వెంకటేశ్వరరావు అందజేశారు. హెచ్ఎం మహ్మద్ ఆలీ మాట్లాడుతూ నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు అర్హులైన విద్యార్థులకు ఏటా రూ.12వేలు స్కాలర్ షిప్ వస్తుందని తెలిపారు.

150 మందికి కంటి పరీక్షలు

చింతలపూడి: సకాలంలో కంటి పరీక్షలు చేయించుకుని కంటి సంబంధ వ్యాధులు రాకుండా చూసుకోవాలని లయన్స్ క్లబ్ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు అన్నారు. ప్రధాని నరేంద్రమోడీ జన్మదినోత్సవ పక్షోత్సవాల సందర్భంగా చింతలపూడి మెరక వీధి రామాలయం వద్ద శనివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆశ్రం హాస్పిటల్ వైద్యులు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 85 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. మరో 20 మందిని కంటి ఆపరేషన్‌ల కోసం రిఫర్ చేసినట్లు చెప్పారు. లయన్స్ క్లబ్ నిర్వాహకులు గోలి చంద్రశేఖర్‌రెడ్డి, చిల్లపల్లి రామ్మోహన్‌రావు, జల్లిపల్లి శివాజీ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పఢావో

కొయ్యలగూడెం: బయ్యనగూడెం ఉన్నత పాఠశాలలో శనివారం బేటీ బచావో– బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆడ పిల్లలు తప్పకుండా చదువుకోవాలని, అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. సమాజంలో ఆడ పిల్లల పట్ల లింగ వివక్ష చూపరాదన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టం ప్రకారం గర్భవతికి స్కానింగ్‌లో స్త్రీ, పురుష లింగ నిర్ధారణ చేయడం నేరమని తెలిపారు. ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే బాలరాజు పరామర్శ


మహిళల కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు శనివారం జీలుగుమిల్లి మండలం పూచికపాడులో పర్యటించారు. ఇటీవల ప్రమాదంలో గాయపడిన వైఎస్సార్‌సీపీ నేత దాసరి బాజీని పరామర్శించారు. అదేవిధంగా అదే గ్రామానికి చెందిన వరలక్ష్మి, చిన్నమ్మ అనే ఇద్దరు మహిళలు కూలి పనుల కోసం తెలగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం చిన్నాపురం గ్రామానికి వెళ్లి వాగులో కొట్టుకుపోయి గల్లంతై మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు పరామర్శించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, సర్పంచ్ సున్నం వరలక్ష్మి, మాజీ సర్పంచ్ పైదా వెంకటేశ్వరరావు, నాయకులు సామేల్ బాషా, మహాలక్ష్మయ్య, చిరంజీవి, వీరంకి వెంకటేశ్వరరావు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

దసరాకి అమ్మవార్ల విగ్రహాలు సిద్ధం


కొయ్యలగూడెంలో అమ్మకానికి సిద్ధంగా కనకదుర్గమ్మ విగ్రహాలు


జంగారెడ్డిగూడెంలో అమ్మవారి విగ్రహాలను విక్రయానికి సిద్ధంగా ఉంచిన దృశ్యం

కొయ్యలగూడెం: దసరా ఉత్సవాల నేపథ్యంలో ఏర్పాటుచేసే శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. అమ్మవార్ల ప్రధాన ఆలయాలతో పాటు మండలంలోని కన్నాపురం, వడ్డీలపేట, యర్రంపేట, రాజవరం గ్రామాలలో ప్రత్యేకంగా కనకదుర్గమ్మవారి విగ్రహాలు ప్రతిష్టించి దసరా ఉత్సవాలు జరపనున్నారు. ఈ నేపథ్యంలో కన్నాపురం రోడ్డులో రెండు అడుగుల నుంచి ఆరు అడుగుల ఎత్తువరకు అమ్మవారి విగ్రహాలు విక్రయానికి సిద్ధంగా ఉన్నాయి. విగ్రహాలను సైజును బట్టి రూ.2 వేల నుంచి రూ.13 వేల వరకు నిర్వాహకులు బుక్ చేసుకున్నారని వ్యాపారి ఇటికల తాతారావు తెలిపాడు.

జంగారెడ్డిగూడెం: దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా పందిళ్ల వద్ద అమ్మవారి విగ్రహాలను నెలకొల్పేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఉత్సవాలకు అమ్మవారి విగ్రహాలు సిద్ధమయ్యాయి. హైదరాబాద్ నుంచి కొనుగోలు చేసుకుని వచ్చి స్థానిక జేపీ సెంటర్‌లో స్టాల్స్ ఏర్పాటు చేసి వ్యాపారి రాంబాబు అమ్మవారి విగ్రహాలను విక్రయిస్తున్నారు. విగ్రహం సైజును బట్టి సుమారు రూ.2,500 నుంచి రూ.25వేల వరకు ధరలను నిర్ణయించారు. అలాగే స్థానిక బైపాస్ రోడ్డు వద్ద స్థానికంగా తయారు చేసిన అమ్మవారి విగ్రహాలను విక్రయిస్తున్నారు.

అక్షర ఆంధ్ర విజయవంతం చేయాలి


అభ్యాసకులకు సూచనలు ఇస్తున్న వయోజన విద్యాశాఖ డీడీ ప్రభాకర్

టి.నరసాపురం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అక్షర ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వయోజన విద్యాశాఖ డిప్యూటీ డైరెక్టర్ జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. శనివారం టి.నరసాపురంలో ఉన్న మూడు అక్షరాల కేంద్రాలను సందర్శించి అభ్యాసకులకు పలు సూచనలు చేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని అమలు చేసి నిరక్షరాస్యులైన మహిళలను, ఉపాధి హామీ పథకంలోని పురుషులను అక్షరాస్యులుగా మార్చాలని కోరారు. క్రియాత్మక, ఆర్థిక, డిజిటల్ విద్యలను ప్రతి ఒక్కరూ నేర్చుకుని నేటి తరంతో పోటీ పడాలని అసిస్టెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ ఆర్ విజయకుమార్ తెలిపారు. మండలంలో 2,400 మంది డ్వాక్రా మహిళలకు, ఉపాధి హామీ పథకంలోని 1000 మంది పురుషులను అక్షరాస్యులుగా మార్చాలని లక్ష్యంగా పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో వలంటరీ టీచర్లు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కునూరులో కుంటుపడిన విద్య



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకుడు శివ

కుక్కునూరు: విద్యాసంవత్సరం ప్రారంభమై నాలుగు నెలలు గడుస్తున్నా పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్య కుంటుపడిందని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు డి శివ విమర్శించారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయంలో సారంగి శౌర్య అధ్యక్షతన విద్యార్థులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు పాఠశాలల్లో టీచర్ల పోస్టులను భర్తీ చేయకపోవడంతో విద్యార్థులకు విద్య అందడం లేదన్నారు. ప్రభుత్వం డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ చేపట్టిన నేపథ్యంలో ముందుగా ఈ ప్రాంతంలోని ఖాళీలను భర్తీ చేయాలని కోరారు. సమావేశంలో కుక్కునూరు మండల సమితి కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, ఏపీ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల, ఐతా సురేష్, చైతన్య, క్రాంతి, ముజాయిద్, సాయికుమార్, ప్రేమ్ చరణ్, మణికంఠ, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలి


స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం: పేద మహిళలకు అంత్యోదయ కార్డులు మంజూరు చేయాలని కోరుతూ దళిత, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట మహిళలు ధర్నా చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ అందుగుల ఫ్రాన్సిస్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీకి చెందిన అనేక మంది పేద మహిళలు పనులు లేక అవస్థలు పడుతున్నారని అన్నారు. అర్హులైన మహిళలను గుర్తించి అంత్యోదయ పథకంలో 35 కేజీల బియ్యాన్ని అందజేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఒక తహసీల్దార్ పీవీ చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అన్నపూర్ణ, సావిత్రి, మరియమ్మ, లలితకుమారి, రాధ, మారతమ్మ, బేబీ, రాణి, తదితరులు పాల్గొన్నారు.

రహదారి అధ్వానంపై రైతుల నిరసన


అధ్వానంగా ఉన్న రహదారిపై రాకపోకలు సాగిస్తున్న రైతులు

కొయ్యలగూడెం: రైతులు ఆరోపించిన విధంగానే పరింపూడి, కన్నాయిగూడెం గ్రామాల మధ్య నూతనంగా నిర్వహిస్తున్న రహదారి అధ్వానంగా మారింది. ఇటీవల ఎన్ఆర్ఇజీఎస్ నిధులు రూ.70 లక్షలతో పాత పరింపూడి నుంచి కన్నాయిగూడెం వరకు గ్రావెల్ రోడ్డు మంజూరైంది. కొద్ది నెలల క్రితం నాణ్యతలేని గ్రావెల్‌తో నిర్మిస్తున్నారంటూ రైతులు ఆందోళన చేయడంతో వ్యవహారం బయటికి వచ్చింది. కూటమి నాయకులు సిండికేట్‌గా వ్యవహరించి ఏమాత్రం నాణ్యతలేని ప్రమాణాలతో ఉన్న బంక మట్టిని తీసుకువచ్చి రోడ్డుపై పోసారని రైతులు ఆరోపించారు. నాటి ఆరోపణలకు తగ్గట్టుగా ఇటీవల కురిసిన వర్షాలకు రహదారి చిత్తడిగా మారి నడవడానికి వీలు లేకుండా మారింది. ఈ నేపథ్యంలో రైతులను బుజ్జగించే ప్రక్రియను కూటమి నాయకులు భుజాన వేసుకుని వారిపై ఒత్తిడి తేవడం ప్రారంభించినట్లు తెలిసింది. అయితే రైతులు మాత్రం ఇప్పటివరకు జరిగిన అవకతవకలపై విచారణ చేసి నాణ్యత కలిగిన గ్రావెల్‌ను వేయాలని డిమాండ్ చేస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఏఈ సురేష్‌ను వివరణ కోరగా మూడు లేయర్లుగా గ్రావెల్ రోడ్డు నిర్మాణం జరగాల్సి ఉంది అని మొదటి లేయర్ వరకే పనులు కొనసాగాయని చెప్పారు.

ప్రశ్నించారని బెదిరింపులు

నాణ్యతలేని రహదారి నిర్మాణంపై ప్రశ్నించినందుకు కొందరు వ్యక్తులు బెదిరింపులకు పాల్పడుతున్నారంటూ కన్నాయిగూడెం గ్రామానికి చెందిన రైతులు శనివారం విలేకరుల సమావేశంలో ఆరోపించారు. పరింపూడి గ్రామం నుంచి కన్నాయిగూడెం గ్రామం వరకు సుమారు నాలుగు కిలోమీటర్ల మేర రూ.70 లక్షల అంచనాతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులను వెచ్చించి గ్రావెల్ రోడ్డు నిర్మిస్తున్నట్లు రైతులు మద్దుకూరి సుభాష్ చంద్రబోస్, మద్దుకూరి వరప్రసాద్ పేర్కొన్నారు. రోడ్డు నాణ్యతతో నిర్మించాలని కోరగా, కాంట్రాక్టర్, అతని తమ్ముడు తమను బెదిరింపులకు గురి చేస్తున్నారని అన్నారు. ఇటీవల తాము పొలం నుంచి వస్తూ ఉండగా కాంట్రాక్టర్, అతని తమ్ముడు తమపై కర్రలు విసిరి పారిపోయారని, తమకు ప్రాణహాని ఉందని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

వ్యక్తి మృతిపై కేసు నమోదు


గోనె జయరాజు మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

టి.నరసాపురం: ప్రమాదవశాత్తు ప్రాజెక్టు నీటిలో మునిగి ఒక వ్యక్తి మృతిచెందాడు. దీనికి సంబంధించి హెచ్‌సీ ఎం.రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశువుల కాపరిగా పనిచేస్తున్న సూరంపూడి గ్రామానికి చెందిన వరికూటి మంగయ్య ఈ నెల 19న గేదెలను మేతకు తీసుకువెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెదికినా ఆచూకీ లభించలేదు. 20వ తేదీన కొత్తపల్లి ప్రకాష్‌బాబు పామాయిల్ తోటకు పక్కన ప్రాజెక్టులో మంగయ్య మృతదేహం లభించింది. గేదెలను నీళ్లల్లో నుంచి బయటకు తీసుకురావడానికి దిగి ప్రమాదవశాత్తు మునిగి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడు సోదరి కోరం ఏసుమణి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

సంక్షిప్తంగా..

రేషన్ డీలర్లకు ఈ–పోస్ యంత్రాల అందజేత

జంగారెడ్డిగూడెం: స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో రేషన్ డీలర్‌లకు ఈ–పోస్ యంత్రాలను సివిల్ సప్లయిస్ అధికారులు శనివారం అందజేశారు. జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలోని జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, టి.నరసాపురం, కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లోని 272 రేషన్ దుకాణాలకు ఈ–పోస్ యంత్రాలు అందజేసినట్లు సివిల్ సప్లయిస్ డీటీలు తెలిపారు. అప్‌గ్రేడ్‌లో భాగంగా డీలర్‌లకు ఈ–పోస్ యంత్రాలు అందించినట్లు తెలిపారు.

జూదరుల అరెస్ట్

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఓ థియేటర్ సమీపంలో ఖాళీ స్థలంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో నలుగురిని అరెస్ట్ చేసి వారి నుంచి రూ.2,950 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై జబీర్ తెలిపారు.

పోషకాహారంపై అవగాహన

బుట్టాయగూడెం: పెరుగుతున్న పిల్లలకు తగినంత పోషకాహారం అందిస్తే పిల్లల్లో అనారోగ్య సమస్యలు దరిచేరవని సీడీపీఓ యూపీ పద్మావతి అన్నారు. నందాపురం పీహెచ్‌సీ వద్ద శనివారం నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. వైద్యురాలు డాక్టర్ అమూల్య బాలింతలు, గర్భవతులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. పౌష్టికాహార వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం సీడీపీఓ పద్మావతి మంచులవారిగూడెం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. సూపర్‌వైజర్ జి.ఉషారాణి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి


పోలవరంలో మొక్కలు నాటుతున్న ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్, అధికారులు

పోలవరం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాస్ అన్నారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన పోలవరంలో మొక్కలను నాటారు. అనంతరం అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించి మొక్కలు, వాటి ప్రాముఖ్యతపై తెలియజేశారు. తహసీల్దార్ ఆర్ఎస్ రాజు, సొసైటీ అధ్యక్షుడు కొణతాల ప్రసాద్, నీటి సంఘం అధ్యక్షుడు పాదం ప్రసాద్, ఉప సర్పంచ్ కోరసిక శ్రీను, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: పొంగుటూరు గ్రామంలో శనివారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారి ఎం.రాజు, ఎంపీడీఓ కె.కిరణ్ కుమార్ మొక్కలు నాటారు.

ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలి

చింతలపూడి: ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం ద్వారా పర్యావరణాన్ని రక్షించుకోవచ్చునని ఎంపీపీ డా బి రాంబాబునాయక్ అన్నారు. స్వచ్ఛాంధ్ర సందర్భంగా శనివారం మండలంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఎంఈఓలు జి రామారావు, కిరణ్‌బాబు, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు.

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ హరిత ఆంధ్రప్రదేశ్ నిర్మాణానికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ, తహసీల్దార్ కె.స్లీవజోజి పిలుపునిచ్చారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా జంగారెడ్డిగూడెంలో అవగాహన ర్యాలీ నిర్వహించి, మానవహారం నిర్మించారు. ఛత్రపతి శివాజీ త్రి శతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం మొక్కలు నాటారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎస్.ప్రసాద్ బాబు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు. లక్కవరం మేజర్ పంచాయతీలో పంచాయతీ సిబ్బంది స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.